# ఇల్లు

అనామకుడు

## ఇల్లు అమ్మడమైంది.

నాలుగేళ్ళుగా నలుగుతున్న పని.

ఉద్యోగ రీత్యా బొంబాయిలో ఉంటున్న మాకు ఇంక ఆ ఊళ్ళో వున్న పొలాన్ని చూసుకోవడం కుదరదని-

మామ్మి పోయాక- నాలుగేళ్ళ క్రితం బేరం మొదలెడితే-

బంగారం పండే పొలాన్ని తొందరగా కొనేసుకున్నారు కాని,

పాత ఇల్లు అమ్మడానికి నాలుగేళ్ళు పట్టింది.

ఆ పనయిపోయినందుకు ఒక పక్క రిలీఫ్‌గా అనిపించినా, మరో పక్క దగ్గిరదాన్ని దేన్నో పోగొట్టుకున్న ఫీలింగ్ కలగసాగింది.

ఇంటి ముందున్న పెద్ద అరుగు మీద మడత కుర్చీ వేసుకు కూర్చుంటే, ఇంటి ఆలోచనలే మనస్సు నిండా ముసురుకోసాగాయి.

అలా ఆ ఇంటి ముందు అరుగు మీద కూర్చోడం అదే ఆఖరిసారి అనుకుంటే అంతకుముందు ఆ ఇంట్లో గడిపిన రోజులు గుర్తు వచ్చాయి.

ప్రతి వేసవికీ ఆ ఊరు వెళ్ళడం, ఆ ఇంట్లో ఒక నెల రోజులుండడం మాకు అలవాటు.

కరెంట్ లేని తాటాకిల్లయినా-

ఆ అరుగు మీదో, మిద్దెలోనో, దొడ్డిలోనో మడత మంచం వేసుకుని పడుకుని చదువుకుంటుంటే ఎంతో హాయిగా వుండేది నాకు.

ఎంత పెద్ద దొడ్డి.

విశాలమైన దొడ్డి నిండా చెట్లు, మొక్కలు, తీగలు.

దొడ్డి మధ్యగా పెద్ద పొగడ చెట్టు.

పొగడ చెట్టు నుండి రాలిన పువ్వులు ఓపిగ్గా ఏరి దండ కట్టి ముందు హాల్లో వున్న దేవుడి ఫోటోకి వేసేది మా మామ్మ. ఏన్నాళ్లుండేదో ఆ దండ వాసన.

పొగడ చెట్టు కేంద్రంగా చుట్టూ పూలమొక్కలు, మామిడి చెట్టు, ఉసిరి చెట్టు, కొబ్బరి చెట్లు.

ఇవన్నీ మా తాతగారు నాటుంటారు.

ఆయన నా కసలు తెలియదు.

మా నాన్నగార్కి పదేళ్ళప్పుడే ఆయన పోయారు.

ఇల్లుని తలచుకుంటే నాకు ఆయనే గుర్తొస్తారు.

గుర్తొస్తారన్న మాట సరికాదు- అసలు నేను చూడని మనిషి నాకు ఎలా గుర్తుకి వస్తారు?

ఆయన ఆలోచనలే వస్తాయి అనడం సబబు.

ఆయన శాంత మూర్తిట. మా అత్త చెప్తుంది.

ఆయనోసారి పక్క ఊరికి ఏదో పని మీద వెళ్ళి ఎండలో మధ్యాహ్నం ఇంటికి చేరారుట.

త్రికాల సంధ్యా వందనం ఆచారంగా గల ఆయన మధ్యాహ్నికం పూర్తి చేసుకుని,

భోజనానికి కూర్చున్నారుట.


భోజనానికి ఒక్కసారే విస్తరి దగ్గర కూర్చోడం. మారు వడ్డన అన్న ప్రసక్తి లేదు.

అవుపోసన పట్టాక మా మామ్మ వడ్డించడం మరిచి పోయానని ఏదో వడ్డించిందిట.

ఆయన ఆ రోజింక అభోజనం.

అయితే మా మామ్మని ఒక్క పరుషపు మాట





అవలేదుట. అంత ఆకలితోను వచ్చిన విద్యార్థులకి పాఠం చెప్పారుట. ఆయన ఉన్నంతకాలం ఇంటి అరుగులు రెండూ విద్యార్థులతో నిండిపోయేవిట.

సంస్కృతాంధ్రాలు నేర్చుకుందుకు,
వేదం చెప్పకుందుకు,

తర్కాన శాస్త్రాలు అభ్యసించేందుకు
ఎప్పుడూ ఎవరో ఒకరు వుండేవారుట.

అసలు అందుకనే అంత విశాలమైన అరుగులు కట్టించుకున్నారేమో ఆయన.

ఇంటి ముందు రెండు పెద్ద అరుగులు.

మధ్య వున్న మెట్లెక్కి ఇంట్లోకి వెళ్తే పెద్ద హాలు.

హాలుకి రెండు వైపులా రెండు మిద్దెలు.

ఆ హాలు దాటితే మరో హాలు.

హాలుకొక పక్క వంట గది, మరోపక్క పూజ గది.

ఇంకొన్నాళ్ళు వుండి వుంటే, ఆ తాటాకింటిని ఇంకా బాగు చేసుకునేవారేమో ఆయన.

ఇంకా కొన్నాళ్ళు బ్రతికి వుంటే సగం రాసిన జీమూత వాహన చరిత్ర పూర్తి చేసి వుండేవారు కాదూ?

ఎంత చక్కటి పద్యరచనో?

"రంగారు బంగారు సింగారమును గూర్చు
 చదువు సంధ్యలు లేని చవట కయిన"

ఈ వాక్యం ఆయన డబ్బు మీద మమకారంతో రాసారా? లేక డబ్బే ప్రధానమైన లోకాన్ని ఎగతాళి చేశారో.

ఏమయినా ఆయన డబ్బు సంపాదించడం పొదుపు చెయ్యడం రెండూ చేసుండాలి.

లేకపోతే సామాన్య కుటుంబంలో పుట్టి తండ్రి దగ్గర నుండి చదువు తప్ప మరే ఆస్తి పొందని శుద్ధ శ్రోత్రియుడు-

ముప్ఫైఅయిదేళ్ళకి పోయేసరికి-

పది ఎకరాల భూమి, ఇల్లు ఎలా సంపాదించినట్లు? పిఠాపురం రాజా దగ్గర, విజయనగరం రాజా దగ్గర సన్మానాలు పొందినమాట నిజం కావచ్చు. చాలా చోట్ల తిరిగి అష్టావధానాలు చేసుండొచ్చు.

ఆయన అష్టావధానం, శతావధానంబుగా చేసేవారుట.


అసలు అష్టావధానం ఎలా చేస్తారో...

పద్యం రాయడమే కష్టం, ఆశు పద్యమంటే ఇంకా కష్టం. దానికి తోడు న్యస్తాక్షరి, నిషిద్ధాక్షరి. వీటితో పాటు వర్ణనలు, దత్తపదులు, ఇలా చెప్పిన పద్యాలన్నీ తిరిగి చెప్పాలి. ఎంతటి ధారణశక్తి?

ఆ విద్య ఎంత గొప్పదయినా-
దాని మీద సంపాదన ఎంత? పౌరోహిత్యం మీద ఎంత వచ్చేదో?

ఎంత పొదుపు చేసి వుంటారో.

సంభావనల సంపాదనలలో కాసులు, అణాలు, దాచి కొనుంటారు పొలం, కట్టుంటారు ఇల్లు.



3130/TEL

తాటాకిల్లే అయినా-

ఎప్పుడో యాభై ఏళ్ళ క్రితం కట్టిన ఇల్లు ఇంకా చెక్కు చెదరలేదు.

ఆ ఇంటిలోని ప్రతి అంగుళం ఆయన పడ్డ శ్రమకి నిదర్శనంగా మిగిలింది.

అసలా ఇల్లు నాకు పాతకంతా ప్రతీకగా అనిపిస్తుంది.

ఆ ఇల్లొక వేద భూమిలా వుంటుంది. ఎప్పుడో కొన్ని వేల సంవత్సరాల క్రింద హిమవత్పర్వత సానువుల్లో గంగానదీ తీరంలో మార్మ్రోగిన మంత్ర ఘోష ఆ ఇంట్లో తిరిగి ప్రాణం పోసుకున్నట్లనిపిస్తుంది.

మా తాతగార్కి జ్యోతిషం బాగా వచ్చునని చెప్తుంది మా అత్త. ఆయన ఇల్లు కట్టడం మొదలెట్టినప్పుడే జాతకం చూసుకున్నారుట.

ఆయనకి గృహ యోగం లేదట.

ఇల్లు కట్టినా అందులో ఆయన వుండరని ఆయనకు తెలుసుట.

అయితే ఇల్లు నాశనం అవుతుందట, లేకుంటే ఆయన పోతారుట.

తెలిసి కూడా కట్టారుట.

మరి స్వంత ఇంట్లో వుండలేనని, తనకు స్వగృహ నిర్మాణంతో మారకం వుందని తెలిసి ఇల్లు ఎందుకు కట్టినట్లు?

ఆయన పోయాక ఆయన పిల్లలు, పిల్లల పిల్లలు వంశ పారంపర్యంగా అనుభవిస్తారనా?

అలాంటి ఇంటిని అమ్మేసామన్న బాధ కలిగింది.

అయితే అది బాధ కాదు.

అదో అనిర్వచనీయమైన అనుభూతి.

గతంలో మనకున్న సంబంధం.

నిజానికి ఆయనకూ, నాకూ తేడా ఏంటి?

ఆయనే మా నాన్నగారై-

మా నాన్నగారే నేనై-

ఇదే కదా సృష్టి క్రమం?

ఇదేగా శాశ్వతం

ఇల్లు శాశ్వతం కాదు.

అయినా అది తరాల మధ్య వారధిగా నిలిచింది.

అందుకే-

ఆ పొగడ చెట్టూ, దాని కింద రాలిన పూలూ;
దొడ్డికి చివర నుయ్యి, తాటాకు చేదా, తియ్యటి నీళ్ళూ
ఒక పక్కగా పెరిగిన నందివర్ధనం మొక్కా;
మిద్దెలో వుంచిన మామిడి పళ్ళ వాసనా;
దంపుడు బియ్యం అన్నం రంగూ;
తాటాకుల మీద తొలకరి జల్లుల చప్పుడూ;
నన్ను వదలకుండా వున్నాయి.
వీటితో పాటు-
నుదుటున విభూది రేకలతో
మెళ్ళో రుద్రాక్ష మాలతో
నిండుగా శాలువా కప్పుకున్న
ఆరడుగుల విగ్రహం-
ముక్కుపొడుం పీలుస్తూ
ఆ ఇంటి మెట్లు దిగుతున్న
తాతగారు గుర్తొస్తున్నారు